# ఆరోగ్యంలో ఆంధ్రప్రదేశ్ భేష్.. ఎన్ఎఫ్హెచ్ సర్వే

**2004లో రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొన్న చర్యల వల్ల ఆరోగ్య సంరక్షణ మెరుగైనట్లు జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే-3 నివేదిక సూచిస్తోంది. మహిళా సాధికారతకు తీసుకొన్న చర్యలు ఆరోగ్య సంరక్షణపై ప్రత్యక్ష ప్రభావాన్ని చూపించాయి. 1998-99లో శిశు మరణాలు ప్రతి వెయ్యి జననాలకు 66. కాగా 2005-06 నాటికి 54కు తగ్గింది. జాతీయ సగటు కన్నా శిశు మరణాలు రాష్ట్రంలో తక్కువ. భారతదేశంలోని అన్ని రాష్ట్రాల్లో కన్నా ఆంధ్రప్రదేశ్, గోవా, తమిళనాడులో ఫెర్టిలిటీ (ప్రజననాలు) తక్కువని సర్వే అభిప్రాయపడింది. రాష్ట్రంలో గర్భనిరోధక సాధనాల వినియోగ రేటు మహిళల్లో ఎక్కువగా ఉండటం ఆరోగ్య సంరక్షణ పట్ల పెరుగుతున్న అవగాహనను తెలుపుతోంది. రాజీవ్ ఆరోగ్యశ్రీతో పాటు వివిధ ఆరోగ్య సంరక్షణ పథకాల అమలుతో రానున్న రోజుల్లో ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే మొదటి స్థానంలో నిలబెట్టగలవు.**

జాతీయ కుటుంబ ఆరోగ్యసర్వే (నేషనల్ ఫ్యామిలీ హెల్త్ సర్వే) 2005-06 ఇప్పటివరకు ఎన్ఎఫ్హెచ్ఎస్ చేపట్టిన సర్వేలలో మూడోది. మొదటి సర్వే 1992-93లోను రెండోది 1998- 99లోను జరిగింది. భారత ప్రభుత్వ ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ఈ సర్వే జరిగింది. ముంబయిలోని 'ఇంటర్నేషనల్ ఇన్స్టిట్యూట్ ఫర్ పాపులేషన్ సైన్సెస్' సర్వేకు నోడల్ ఏజెన్సీగా వ్యవహరించింది. 2005-06లో చేపట్టిన సర్వేకు అమెరికాలోని అంతర్జాతీయ అభివృద్ధి ఏజెన్సీ, బ్రిటన్‌లోని అంతర్జాతీయ అభివృద్ధి శాఖ, బిల్ అండ్ మెలిండా గేట్స్ ఫౌండేషన్, UNICEF, UNFPA, భారత ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించాయి. జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే-3కు సాంకేతిక సహకారాన్ని అమెరికాలోని మాక్రో ఇంటర్నేషనల్ అందించింది. హెచ్ఐవీ అంశానికి సంబంధించి 'జాతీయ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ', పుణేలోని 'జాతీయ ఎయిడ్స్ పరిశోధన ఇన్స్టిట్యూట్' సాంకేతిక సహకారాన్నందించాయి. 2005-06 దత్తాంశం ఆధారంగా రూపొందించిన ఈ సర్వే నివేదికను 2008 డిసెంబర్‌లో ప్రకటించారు. ఆంధ్రప్రదేశ్‌లో ఎన్ఎఫ్హెచ్ఎస్-3 ప్రకారం- 15 నుంచి 49 సంవత్సరాల వయోవర్గంలో ఉన్న 7128 మహిళలు, 15-54 సంవత్సరాల వయోవర్గంలో ఉన్న పురుషుల వద్ద నుంచి జనాభా, ఆరోగ్యం, పౌష్టికాహారం గురించి సమాచారం సేకరించింది. రాష్ట్రంలోని గ్రామీణ, పట్టణ ప్రాంతాలు, హైదరాబాద్‌లోని మురికివాడలు, ఇతర ప్రాంతాల్లో నివసిస్తున్న 6,668 కుటుంబాలను శాంపుల్‌గా తీసుకొని వారి వద్ద నుంచి సేకరించిన సమాచారాన్ని రాష్ట్రం మొత్తానికి అన్వయిస్తూ నివేదిక రూపొందించారు. రాష్ట్రంలో మొత్తం మీద కుటుంబ రెస్పాన్స్ రేటు 98 శాతం. కాగా వ్యక్తిగత రెస్పాన్స్ రేటు అర్హులైన మహిళల్లో 94 శాతం, అర్హులైన పురుషుల్లో 89 శాతం ఉంది.

### హౌస్‌హోల్డ్ కాంపోజిషన్:

సర్వేకు ఎంచుకున్న కుటుంబాల్లో 1/3వ వంతు పట్టణ ప్రాంతాల్లోను, 2/3వ వంతు గ్రామీణ ప్రాంతాల్లో

నివసిస్తున్నారు. సగటున ప్రతి కుటుంబానికి నలుగురు సభ్యులు ఉండగా 15 శాతం కుటుంబాలను మహిళలే నిర్వహిస్తున్నారు. ఆంధ్రప్ర దేశ్‌లోని కుటుంబాల్లో కుటుంబ పెద్దల శాతాన్ని గమనిస్తే 85 శాతం హిందువులు. కాగా, 9 శాతం ముస్లింలు, 6 శాతం క్రిస్టియన్లు కుటుంబ పెద్దలుగా ఉన్నారు. 18 శాతం కుటుంబ పెద్దలు షెడ్యూల్డ్ కులాలకు సంబంధించినవారు కాగా, 7 శాతం షెడ్యూల్డ్ తెగలు, 49 శాతం ఇతర బలహీన వర్గాలకు సంబంధించిన వారు ఉన్నారు. 15 సంవత్సరాల లోపు ఉన్న జనాభా 30 శాతం. కాగా 65 సంవత్సరాలు అంతకన్నా ఎక్కువ వయసు ఉన్న జనాభా 6 శాతం. 18 సంవత్సరాల లోపు వారిలో తమ తల్లిదండ్రుల్లో ఎవరో ఒకరిని కోల్పోయినవారు 5 శాతం ఉండగా.. 84 శాతం మంది తమ తల్లిదండ్రులు ఇద్దరితో నివసిస్తున్నారు. 11 శాతం మంది ఎవరో ఒకరినే కలిగి ఉన్నారు. 56 శాతం కుటుంబాలు పక్కా గృహాల్లో నివసిస్తున్నాయి. 85 శాతం గ్రామీణ, 95 శాతం పట్టణ కుటుంబాలు మొత్తం మీద 88 శాతం కుటుంబాలు విద్యుత్ సౌకర్యం పొందాయి. 1998-99లో ఈ కుటుంబాలు 74 శాతం మాత్రమే. 1998-99లో 73 శాతం కుటుంబాలకు మరుగుదొడ్డి సౌకర్యం లేకపోగా 2005-06లో వీరి శాతం 58కు తగ్గింది. 73 శాతం గ్రామీణ కుటుంబాలకు, 24 శాతం పట్టణ కుటుంబాలకు మరుగుదొడ్డి సౌకర్యాలు లేనట్లు ఈ నివేదిక అభిప్రాయపడింది. 99 శాతం పట్టణ కుటుంబాలు, 92 శాతం గ్రామీణ కుటుంబాలు మొత్తం మీద 94 శాతం కుటుంబాలకు మెరుగైన తాగునీటి సౌకర్యం లభిస్తోంది.

### సంపద సూచీ:

33 కుటుంబపరమైన ఆస్తులు, గృహవసతి, వినియోగదారుల ఆస్తుల యాజమాన్యం, నీరు, విద్యుచ్ఛక్తి లభ్యత ఆధారంగా సంపద సూచీ రూపొందించారు. కుటుంబ జనాభాను 20 శాతం చొప్పున 5 గ్రూపులుగా విభజించారు. జాతీయ స్థాయిలో మొదటి గ్రూపు (తక్కువ, పేదరికం) నుంచి 5వ గ్రూపు (ఎక్కువ, సంపద ఎక్కువగా ఉన్న)వరకు వర్గీకరించారు. సంపద సూచీని జాతీయ స్థాయిలో నిర్వచించినందువల్ల ప్రతి రాష్ట్రంలోనూ ఈ 5 గ్రూపుల్లోని జనాభా నిష్పత్తిలో వైరుధ్యాలు ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో 12 శాతం కుటుంబాలు (11 శాతం జనాభా) సంపద సూచీ మొదటి గ్రూపుకు సంబంధించినవారు. కాగా రాష్ట్రంలో 16 శాతం గ్రామీణ కుటుంబాలు, 5 శాతం పట్టణ కుటుంబాలు తక్కువ, పేదరికంతో కూడుకొని మొదటి గ్రూపుకు సంబంధించినవిగా సర్వే అభిప్రాయపడింది.

### విద్య:

6 నుంచి 10 ఏళ్ల వయోవర్గం వారిలో 88 శాతం ప్రాథమిక విద్య కోసం పాఠశాలలకు హాజరవుతున్నారు. 11 నుంచి 14 సంవత్సరాలలోపు వారిలో స్కూల్ హాజరు 73 శాతం ఉండగా 15 నుంచి 17 సంవత్సరాల వయోవర్గం వారిలో 39 శాతం మాత్రమే ఉంది. స్కూల్ వయసు జనాభాలో విద్యకు సంబంధించి రాష్ట్రంలో లింగ వైవిధ్యం (Gender disparity) స్పష్టంగా కన్పిస్తుంది. 6 నుంచి 17 సంవత్సరాల వయో

వర్గానికి సంబంధించిన వారిలో 77 శాతం బాలురు, 66 శాతం బాలికలు పాఠశాలల్లో నమోదయ్యారు. 6 నుంచి 10 సంవత్సరాల వయోవర్గానికి సంబంధించి గ్రామీణ ప్రాంతాల్లో 90 శాతం బాలురు, 84 శాతం బాలికలు పాఠశాలల్లో నమోదయ్యారు. పట్టణ ప్రాంతాల్లో ప్రాథమిక విద్యకు సంబంధించి ఇదే వయో వర్గంలో బాలురుకన్నా బాలికల నమోదు నిష్పత్తి కొంత ఎక్కువగా ఉంది.

ఈ సర్వే ప్రకారం 15 నుంచి 49 సంవత్సరాల వయో వర్గం వారిలో 72 శాతం పురుషులు, 50 శాతం స్త్రీలు అక్షరాస్యులు. సర్వేలో పాల్గొన్న అందరూ పురుషులు, మహిళలు పాఠశాలల్లో పిల్లలకు నైతిక విలువల ఉద్బోధ తప్పనిసరి అని భావించారు. కుటుంబ నియంత్రణ పద్ధతుల గురించి అవగాహన బాలికలకు తప్పనిసరి అని 2/5 వంతు మహిళలు, 2/3 వంతు పురుషులు అభిప్రాయపడ్డారు.

## ఫెర్టిలిటీ లెవల్స్:

20-49 సంవత్సరాల వయో వర్గంలోని మహిళల్లో సగటు వివాహ వయసు 16.1 సంవత్సరాలు కాగా 25-49 సంవత్సరాల వయో వర్గంలోని పురుషుల్లో సగటు వివాహ వయసు 21.9 సంవత్సరాలు. 20 నుంచి 24 సంవత్సరాల వయో వర్గంలోని 55 శాతం స్త్రీలు, 25-29 సంవత్సరాల వయో వర్గంలోని 35 శాతం పురుషులు చట్ట బద్ధమైన వివాహ వయసు కన్నా ముందే వివాహితులయ్యారు. దేశంలోని అన్ని రాష్ట్రాల్లో కన్నా ఆంధ్రప్రదేశ్, గోవా, తమిళనాడులలో ఫెర్టిలిటీ రేటు తక్కువని సర్వే అభిప్రాయపడింది. 15నుంచి 49 సంవత్సరాల వయో వర్గంలోని మహిళల్లో గర్భనిరోధక సాధనాల వినియోగ రేటు 1998-99లో 60 శాతం. కాగా 2005-06లో 68 శాతానికి పెరగడం మహిళల్లో ఆరోగ్య సంరక్షణ పట్ల పెరుగుతున్న అవగాహనను తెలుపుతోంది. గర్భనిరోధక సాధనాల వినియోగ రేటు క్రిస్టియన్ మహిళల్లో 69 శాతం కాగా, హిందూ మహిళల్లో 68 శాతం, ముస్లిం మహిళల్లో 62 శాతం. సంపద ఎక్కువగా ఉన్న మహిళల్లో వీటి వినియోగం 74 శాతం.

## రక్త హీనత:

మహిళలు, పిల్లల్లో రక్తహీనత ఆంధ్రప్రదేశ్‌లో ఒక ముఖ్య ఆరోగ్య సమస్య. బాలురు కన్నా బాలికల్లో రక్తహీనత ఎక్కువగా ఉంది. 6 నుంచి 59మాసాల లోపు ఉన్న శిశువుల్లో సుమారు 71 శాతం రక్తహీనత కలిగినవారే. ఆంధ్రప్రదేశ్‌లో 63 శాతం మహిళలు రక్తహీనతతో బాధపడుతుండగా వీరిలో 39 శాతం మైల్డ్ ఎనీమియాతోను, 21 శాతం మోడరేట్ ఎనిమియాతోను, 3 శాతం తీవ్ర రక్తహీనతతో ఇబ్బందిపడుతున్నారు. పిల్లకు పాలిచ్చే 59 శాతం గర్భవతుల్లో 73 శాతం మహిళలు రక్తహీనత కలిగిన వారే. విద్యావంతులైన మహిళలు, ఎక్కువ సంపద ఉన్న వర్గం మహిళల్లో ఇతరుల్లో కన్నా రక్తహీనత తక్కువ. ఆంధ్రప్రదేశ్‌లో 76 శాతం మహిళలకు, 94 శాతం పురుషులకు ఎయిడ్స్ పట్ల అవగాహన ఉందని సర్వే అభిప్రాయపడింది.

## మహిళా సాధికారత:

తమ ఆరోగ్య సంరక్షణ, కుటుంబ వినియోగవ్యయం, తమ సొంత కుటుంబం లేదా బంధువుల ఇళ్లకు వెళ్లటం లాంటి నిర్ణయాలను తామే స్వయంగా తీసుకుంటున్నామని 53 నుంచి 66 శాతం ఇటీవల వివాహితులైన మహిళలు అభిప్రాయపడ్డారు. మెక్రో క్రెడిట్ కార్యక్రమం గురించి 60 శాతం మహిళలకు అవగాహన ఉంది. 51 శాతం మహిళలకు మార్కెట్లో వస్తు కొనుగోళ్ల విషయంలో పూర్తి స్వేచ్ఛ ఉందని, 42 శాతం మహిళలు తమ గ్రామం నుంచి వేరే గ్రామాలకు ప్రయాణించే స్వేచ్ఛ కలిగి ఉన్నారని సర్వే అభిప్రాయపడింది. మహిళా సాధికారత కోసం ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు సాధికారత పెంపుకు దోహదపడ్డాయని వీరి అభిప్రాయాలను బట్టి తెలుసుకోవచ్చు.